క్లుప్తంగా

పీజీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్స్

కొల్లాపూర్: కొల్లాపూర్‌లోని ప్రభుత్వ పీజీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్‌లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మార్క్ పోలోనియస్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఎంఏ తెలుగు, ఎంఏ ఇంగ్లిష్, మ్యాథమెటిక్స్, కామర్స్, ఎంఎస్‌డబ్ల్యూ కోర్సుల్లో సీట్లు ఖాళీగా ఉన్నాయని.. డిగ్రీ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈనెల 8వ తేదీలోగా దరఖాస్తు చేసుకుని అడ్మిషన్ పొందాలని సూచించారు. వివరాలకు 9618414796, 9908740482 నంబర్లను సంప్రదించాలని కోరారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



కల్వకుర్తిరూరల్: పట్టణంలోని హనుమాన్ నగర్‌కు చెందిన పర్వతాలు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న మిత్ర ఫౌండేషన్ సభ్యులు మంగళవారం బాధితుడి ఇంటికి వెళ్లి రూ.5వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మిత్ర ఫౌండేషన్ అధ్యక్షుడు చంద్రకాంత్ రెడ్డి, శ్రీకాంత్, ఆకుతోట నరేష్, సభ్యులు ఉన్నారు.

ముమ్మరంగా సమావేశ భవన నిర్మాణ పనులు



తాడూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయ సముదాయ ఆవరణలో సమావేశ భవన నిర్మాణ పనులు చురుకుగా కొనసాగుతున్నాయి. మండల పరిషత్ కార్యాలయంలో కొత్తగా సమావేశ భవన నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు అయ్యాయి. దాదాపు 100 మందికి పైగా సమావేశంలో కూర్చునేలా హాల్‌ని నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ శ్రీదేవి మాట్లాడుతూ నెల రోజుల్లో పనులను పూర్తి చేస్తామని పేర్కొన్నారు. త్వరలో నిర్వహించే మండల సమావేశాన్ని కొత్త భవనంలో నిర్వహిస్తామన్నారు.

ప్రత్యేక పూజలు



కొల్లాపూర్: పట్టణంలోని ఈదమ్మ దేవతకు 19వ వార్డుకు చెందిన యువకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ అభ్యర్థి జూపల్లి కృష్ణారావు ఎమ్మెల్యేగా గెలుపొందడంతో మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో బాలు, వెంకట్, శీను తదితరులున్నారు.

నాయకులకు సన్మానం



చారకొండ: కల్వకుర్తి కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణ రెడ్డి గెలుపు కోసం అహర్నిషలు కష్టపడిన నాయకులకు మంగళవారం జిల్లా నాయకుడు సంజీవ్ కుమార్ సన్మానించారు. మండలంలోని జూపల్లిలో నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అభ్యర్థి విజయం కోసం కృషి చేసిన నాయకులను, కార్యకర్తలను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ముజ్జుబాయి, సిరాజ్, రామచంద్రి, శ్రీను, అక్రం, అర్జున్, ధనలక్ష్మి, శ్రీను తదితరులు ఉన్నారు.

కేంద్రాలకు సద్వినియోగం చేసుకోవాలి



కల్వకుర్తి: పట్టణంతో పాటు ఊర్కొండ మండలాలలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలో పీఏసీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మేలు రకం ధాన్యానికి రూ.2203లు, సాధారణ రకానికి రూ.2183 లు మద్దతుధర చెల్లిస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని కోరారు.

ముసురుతో రైతన్న విలవిల



ఉప్పునుంతల శివారులో కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట



కల్వకుర్తిలో రోడ్డుపై ఆరబోసిన ధాన్యం ఎత్తుతున్న రైతులు

కల్వకుర్తిరూరల్: తుఫాన్ ప్రభావం కారణంగా మండలంలో మంగళవారం వేకువ జాము నుంచి ముసురు కురుస్తోంది. దీంతో మేఘాలు కమ్ముకోవడంతో వాతావరణం చల్లబడింది. రోడ్లపై వరిధాన్యాన్ని ఆరబెట్టిన రైతుల అవస్థలు అంతాఇంతా కాదు. కొందరు పంట పొలాల్లో ధాన్యాన్ని నిల్వ చేశారు. అదేవిధంగా ముసురుకు పత్తి ఎర్రబారే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కల్లముందే ఆరబోసిన ధాన్యం తడిచింది. ఒక్కసారిగా మారిన వాతావరణంతో జనం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముసురు వర్షం అన్నదాతలకు తిప్పలు తప్పలేదు.

పంటలకు నష్టం

ఉప్పునుంతల: మండలంలో సోమవారం రాత్రి నుంచి కురుస్తున్న ముసురు వర్షాలకు వరి, వేరుశెనగ పంటల రైతులు ఆందోళన చెందుతున్నారు. వరి పంట ప్రస్తుతం కోత దశలో ఉండటంతో పంటకు నష్టం వాటిల్లే అవకాశం ఉంది. వరికోత మిషన్లు పొలాల్లోకి వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే చెరువులు, వంపు ప్రాంతాల్లో ఉన్న పొలాలు ఆరకపోవడంతో కోతల విషయంలో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వరికోతలు చేసిన రైతులు వరి ధాన్యం కల్లాలోనే ఉంచారు. ధాన్యం తడవకుండా టార్పాలిన్లు కప్పుతున్నారు. ముసురుకు వేరుశనగకు చీడపీడల ఉధృతి పెరిగి పంట నష్టం జరుగుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భూసార పరీక్షలపై అవగాహన



మాట్లాడుతున్న ఏఓ నాగార్జునరెడ్డి

లింగాల: మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్రపంచ నేల ఆరోగ్య దినోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ నాగార్జునరెడ్డి భూసార పరీక్షలపై రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. అనంతరం ఏఓ మాట్లాడుతూ భూసార పరీక్షలు పంటల దిగబడికి ఎంతగానో దోహదపడుతాయన్నారు. దిగుబడులు అధికం రావడానికి రసాయనిక ఎరువులు, పురుగుల మందులను ఎక్కువగా వాడుతున్నారని, వీటి వాడకం వలన భూమి సారం తగ్గుతుందన్నారు. దిగుబడులు ఆశించిన స్థాయిలో రావని సూచించారు. భూసార పరీక్షలతో ఎలాంటి భూమిలో ఏ రకమైన పంటను సాగు చేసుకోవాలో తెలుస్తుందని వివరించారు. రసాయనిక ఎరువులు, మందులను తగ్గించి వాటి స్థానంలో వర్మీ కంపోస్టు, పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లు, పందుల ఎరువుల లాంటి సేంద్రియ పోషకాలను వినియోగించడం వలన ఆశించిన స్థాయిలో దిగుబడులు వస్తాయని తెలిపారు. భూసంరక్షణలో భాగంగా ప్రతి మూడేళ్లకు ఒక సారి మట్టి పరీక్షలు చేయించాలని ఆయన రైతులను కోరారు. ఈ సమావేశంలో ఏఈఓ సురేంద్రరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఆడపిల్లలను కాపాడుకుందాం



విద్యార్థులతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

కల్వకుర్తిరూరల్: ఆడ పిల్లలను కాపాడుకునే బాధ్యత అందరిది అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి అన్నారు. మంగళవారం మండలంలోని తోటపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఆడపిల్లల రక్షణ, విద్య, బాల్యవివాహాలు, లైంగిక వేధింపులపై అవగాహన కల్పించారు. జిల్లా సభ్యురాలు రేణుక విద్య ఆవశ్యకతను తెలిపారు. సఖి, కిషోర బాలికలకు ఉచిత ఆహారం, మగపిల్లలతో సమాన అవకాశం గురించి వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విష్ణుమూర్తి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా మీ సేవ కేంద్రాలు



పెద్దకొత్తపల్లిలో నిరుపయోగంగా ఉన్న మీసేవ కేంద్రం

పెద్దకొత్తపల్లి: మండలంలో 15 గ్రామ పంచాయతీల్లో నిర్మించిన మీ సేవా కేంద్రాలు రెండేళ్లు అవుతున్నా నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. రూర్బన్ మిషన్ కింద ఒక్కొక్క మీసేవ కేంద్రం భవన నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేసి 15 గ్రామ పంచాయతీల్లో భవన నిర్మాణాలను పూర్తి చేశారు. మీ సేవా కేంద్రాలకు కంప్యూటర్లు, టేబుల్స్ రూ.2 లక్షలతో సామగ్రిని కొనుగోలు చేసి ఆయా గ్రామ పంచాయతీలకు అప్పగించారు. ప్రభుత్వం ఆ కంప్యూటర్లను గ్రామ పంచాయతీ పనుల వివరాల నమోదు కోసం వినియోగిస్తున్నారు. రూర్బన్ మిషన్ అధికారులు పట్టించుకొని మండలంలోని మీ సేవా కేంద్రాలను ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై ఎంపీడీఓ కృష్ణయ్యను వివరణ కోరగా గ్రామ పంచాయతీల్లో ఉన్న మీ సేవా కేంద్రాలకు నెట్ సౌకర్యం లేక ప్రారంభించలేదని తెలిపారు. త్వరలో నెట్ కనెక్షన్‌లు ఇచ్చి ప్రారంభించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

కార్యకర్తలు అధైర్యపడొద్దు



కల్వకుర్తిరూరల్: బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధైర్యపడొద్దని మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం అన్నారు. మంగళవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజలు మార్పు కోరుకున్నారని వారి నిర్ణయాన్ని తాము శిరసావహిస్తామని తెలిపారు. కల్వకుర్తిలో పార్టీ అభ్యర్థి ఓటమి బాధ కలిగించిందని ఆవేదన వ్యక్తం చేశారు. నూతన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి ఆయన శుభాకాంక్షలు చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు పరచడంతో పాటు మున్సిపల్ అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. సమావేశంలో మాజీ చైర్మన్ శ్రీశైలం, వైస్ చైర్మన్ షాహెద్, జనార్దన్‌రెడ్డి, భోజిరెడ్డి, సైదులు గౌడ్, సూర్యప్రకాశ్‌రావు, చైర్మన్ చిన్న, కిషోర్‌రెడ్డి, మధు, శేఖర్, నబీల్ తదితరులు పాల్గొన్నారు.

రేకుల షెడ్డే వంటగది



తాడూరు: మండల కేంద్రంలో ఉన్నత పాఠశాల నిర్మాణ పనులు పూర్తి కాకపోవడంతో పాఠశాల నిర్వహణ కూచుకుళ్ల సౌభాగ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగుతోంది. వంటగది లేకపోవడం వల్ల రేకుల షెడ్ ఏర్పాటు చేసి వంటగదిగా మార్చారు. దీంతో వంట నిర్వాహకులు వంట చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా విద్యార్థులు భోజనం తినేందుకు అవస్థలు ఎదుర్కొంటున్నారు. రెండేళ్లుగా పాఠశాల భవనం నిర్మాణ పనులు కొనసాగుతుండడంతో కళాశాల, ఉన్నత పాఠశాల విద్యార్థులకు చదువుకునేందుకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి త్వరగా పాఠశాల నిర్మాణ పనులు పూర్తి చేయాలని అధ్యాపకులు, ఉపాధ్యాయులు కోరారు.

అంధుల ఫౌండేషన్‌కు విరాళం



కొల్లాపూర్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లా సీఎస్ పురం మండలం కమ్మపాడు గ్రామంలోని రీచ్ ఫర్ ది బ్లైండ్ ఫౌండేషన్‌కు కొల్లాపూర్‌లోని స్కాలర్స్ పాఠశాల నిర్వాహకులు రూ.52,308 విరాళంగా అందజేశారు. సంస్థ నిర్వాహకులు ఎం.దాసుకు మంగళవారం విరాళాన్ని అందించారు. పాఠశాల విద్యార్థులు ఇచ్చిన చందాలతో పాటు, పాఠశాల తరఫున నగదు సహకారం అందించినట్లు కరస్పాండెంట్ రాముయాదవ్ తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ రవికుమార్, ఉపాధ్యాయులు ఉన్నారు.

వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి



కోడేరు: మండలంలోని ఖానాపూర్ వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టకపోవడంతో వర్షాకాలంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పొలాలకు వెళ్లాలంటే నీటిలో నుంచి వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని రైతులు వాపోయారు. ఏడాది కిందట వర్షాకాలంలో నీటి ఉధృతికి కొట్టుకుపోయి ఒకరు మరణించిన ఘటన చోటుచేసున్నా అధికారులు స్పందించడం లేదని స్థానికులు ఆరోపించారు. బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ప్రయోజనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బ్రిడ్జి నిర్మాణం చేపడితే సాతాపూర్, మహాసముద్రం గ్రామాలకు రాకపోకలకు అనువుగా ఉంటుంది. వెంటనే అధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని రైతులు, ప్రయాణికులు కోరుతున్నారు.

శంకుస్థాపనకే పరిమితం

మన్ననూర్: అమ్రాబాద్ మండలం ప్రశాంతినగర్ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా తయారైంది. కొంత కాలంగా రోడ్డు వేయిస్తామని ఎన్నికల సమయంలో నాయకులు తరుచుగా హామీలు ఇవ్వడం తిరిగి చూడకపోవడం పరిపాటిగా మారింది. నాలుగు నెలల కిందట ప్రస్తుత మాజీ ఎమ్మెల్యే గువ్వల బాల్‌రాజ్ పలు మార్లు హామీలు ఇచ్చి 10 ఏళ్ల కాలం వెళ్లదీశారు. ఎన్నికల ముందు గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణం చేస్తున్నట్లు ప్రభుత్వం తరుపున రూ.1.97 లక్షలు నిధులు మంజూరయ్యాయని ఆగమేఘాల మీద అప్పటి రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీష్‌రావు రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఇప్పటికి ఆ రోడ్డు నిర్మాణం పనుల ఊసే ఎత్తడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ ఎమ్మెల్యే చొరవ తీసుకొని బీటీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రోడ్లపైనే మురుగు



నాగర్‌కర్నూల్‌రూరల్: మండలంలోని గుడిపల్లిలో మినీ ట్యాంక్ నుంచి వస్తున్న నీరుతో పాటు ఇళ్ల నుంచి నుంచి వస్తున్న మురుగు రోడ్లపైనే ప్రవహిస్తోంది. గ్రామం నుంచి వనపట్లకు వెళ్లేందుకు స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. మురుగు రోడ్డుపై పారుతుండడంతో రోడ్డు బురదమయంగా మారింది. వాహనదారులకు, పాదచారులకు తీవ్ర ఆటంకం ఏర్పడుతుందని గ్రామస్తులు వాపోతున్నారు. ట్యాంక్ నిండి వృథా నీరు పారడంతో సమస్య మరింత తీవ్రతరం అయ్యిందని గ్రామస్తులు పేర్కొన్నారు. ఇప్పటికైనా అండర్ డ్రెయినేజీ నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

అసంపూర్తిగా మురుగుకాల్వ



తాడూరు: మండల కేంద్రంలో పోచమ్మ ఆలయం వద్ద ప్రధాన ఆర్‌అండ్‌బీ రోడ్డుకు అనుసరించుకొని ఉన్న మురుగుకాల్వ అసంపూర్తిగా ఉంది. దీంతో మురుగు ముందుకెళ్లలేక ఒకేచోట నిల్వ ఉండటంతో దుర్వాసన వెదజల్లుతోంది. రోడ్డు పక్కన వెళ్లే పాదచారులకు, సమీపంలోని పోచమ్మ దేవాలయానికి వచ్చే భక్తులు కంపు వాసన భరించలేకపోతున్నారు. మురుగు కాల్వ నిర్మాణ పనులను పూర్తి చేయాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు గ్రామస్తులు విన్నవించినా పట్టించుకోవడం లేదు. అధికారులు చొరవ తీసుకొని అసంపూర్తిగా ఉన్న మురుగుకాల్వను పరిశీలించి కాల్వ నిర్మాణ పనులు పూర్తి చేయాలని కోరారు.

ఎమ్మెల్యే వంశీకృష్ణకు మంత్రి పదవి ఇవ్వాలి

కల్వకుర్తిరూరల్: అచ్చంపేట ఎమ్మెల్యేగా గెలుపొందిన వంశీకృష్ణకు మంత్రి పదవి ఇవ్వాలని ఎల్లికల్ మాజీ ఎంపీటీసీ రామకృష్ణ మంగళవారం ఓ ప్రకటనలో అధిష్టానాన్ని కోరారు. పార్టీ బలోపేతానికి కృషి చేసిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

బల్మూర్: ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణకు మంత్రి పదవి ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు వెంకటయ్య మంగళవారం ప్రకటనలో కోరారు. 25 ఏళ్లుగా పార్టీ బలోపేతానికి ఎమ్మెల్యే వంశీకృష్ణకు ఎంతో కృషి చేశారని దీంతో ఆయన సేవలు గుర్తించి మంత్రి పదవి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

సీఎం ప్రకటనపై సంబరాలు



అచ్చంపేటలో నృత్యాలు చేస్తున్న యువకులు, కార్యకర్తలు

సాక్షి, నెట్‌వర్క్: ముఖ్యమంత్రిగా ఏఐసీసీ అధిష్టానం రేవంత్‌రెడ్డిని ప్రకటించడంతో జిల్లా వ్యాప్తంగా మంగళవారం కాంగ్రెస్ నాయకుల సంబరాలు అంబరాన్నంటాయి. కొల్లాపూర్, అచ్చంపేట, పెద్దకొత్తపల్లి, ఉప్పునుంతల, లింగాలతో పాటు పలు గ్రామాల్లో బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఒకరికొకరు స్వీట్లు పంచుకొని ఆనందం వ్యక్తం చేశారు. నాయకులు, నినాదాలు చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఉప్పునుంతలలో..



లింగాల మండలం అంబట్‌పల్లిలో



అచ్చంపేటలో సంబరాలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



పెద్దకొత్తపల్లిలో నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు